ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (ఆకివీడులో శ్రీనాన్నగారి ప్రవచనము, 21-1-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మానవ సమాజమునకు సేవచేయాలని ఉంది దానికి నన్ను ఏమి చేయమంటారు అని ఒకరు భగవాన్‌ను అడిగితే నీవు ఆత్మాజ్ఞానమును సంపాదించు అని భగవాన్ చెప్పారు. మానవ సమాజమునకు ఉపయోగపడాలి అని నీవు అనుకొంటే ముందు నీవు ఆత్మజ్ఞానమును సంపాదించు. ఆత్మజ్ఞానమును సంపాదించటంవలన నీ ద్వారా సూక్ష్మాతిసూక్ష్మరూపములో అతి శక్తివంతమైన సహాయం సమాజమునకు జరుగుతుంది. నీ ద్వారా జరుగుతున్న సహాయమును సమాజం గుర్తించవచ్చు, గుర్తించకపోవచ్చు అది వేరే విషయం. సాధారణంగా సామాన్యమానవుడు ఏదైనా ఒక మంచి పనిచేస్తే గుర్తింపు కోరతాడు. ఆ గుర్తింపు ఇవ్వకపోతే మేము ఎంతకష్టపడ్డామో మనలను ఎవరూ గౌరవించటంలేదు అనుకొంటాడు. కాని ఆత్మానుభవం పొందినవాడికి వ్యక్తిగతమైన నేను అక్కడ ఉండదు. అతనికి ఇతరులు లేరు కాబట్టి గుర్తింపు ఉందా, లేదా అనే సమస్యవాడికి ఉండదు. జ్ఞానము లేకపోతే మనం సమాజమునకు సహాయం చేయలేము. జ్ఞానమునుండి శక్తి వస్తుంది. ఎవడైతే జ్ఞానము పొందాడో వాడిద్వారా సమాజము[redacted] ఉద్ధరించబడుతుంది. అదీ సమాజమునకు తెలియకపోవచ్చును. ఎందుచేతనంటే ఉద్ధరించబడటం అనేది స్థూలంగా ఉండదు. సూక్ష్మాతిసూక్ష్మంగా ఉంటుంది.

అజ్ఞాని తన ఆనందమునకు, సంతోషమునకు దేహము మీద, మనస్సుమీద, ఇంద్రియాలమీద ఆధారపడి ఉంటాడు. జ్ఞాని తన ఆనందమునకు[redacted], శాంతికి[redacted] ఇంద్రియాలమీదగాని, మనస్సుమీదగాని, దేహముమీదగాని ఆధారపడి ఉండడు. వాడు సమాజమునకు అతీతుడు. ఏ రకమైన ప్రాపంచిక బంధములు లేనివాడు జ్ఞాని. జ్ఞాని బంధరహితుడు. ఎక్కడ ఏరూపములో బంధము ఉన్నావాడు జ్ఞాని కాడు. ఎవడైతే బంధరహితుడోవాడికి దుఃఖకారణముకూడా ఉండదు.

భగవాన్ ఆయన దగ్గరకు వచ్చినవారిని మీరు ఎక్కడనుండి వచ్చారు అనిగాని, మీకులం ఏమిటి అనిగాని, మీ మతం ఏమిటి అనిగాని, వారి ఆస్తులగురించిగాని, వారి పదవులగురించిగాని ఎవరినీ ఎప్పుడూ అడగలేదు. ఆయన ఋషి, ఎందుచేతనంటే ఈమతాలు, ఈకులాలు, ఈగొడవలు అన్నీ కేవలము దేహమునకు, మనస్సునకు సంబంధించినవి. ఆయన ఆత్మస్వరూపుడు. మిమ్మలనుకూడా ఆత్మగానే చూసేవాడు.

ఏ జ్ఞాని అయినా సౌమ్యంగానే ఉంటాడు. బాహ్యంగా చూస్తే ఒకోజ్ఞానిద్వారా ఒకోపని జరుగుతూ ఉంటుంది. లోపల ఉన్నస్థితిలో మాత్రం భేదం ఉండదు. ఆ శరీరము ఎందుకు వచ్చిందో ఆ ఉపాధి ద్వారా ఆపని జరుగుతూ ఉంటుంది. రాముడు దేవుడు, కృష్ణుడు దేవుడు అనుకొంటున్నాము. రాముడు ఉపాధిద్వారా జరిగిన పని వేరు, కృష్ణుడు ఉపాధిద్వారా జరిగినపని వేరు. కాని లోపల ఉన్నస్థితి ఒక్కటే. లోపల ఉన్న చైతన్యంలో భేదం లేదు.

దేవుని పూజించుకొంటున్నాము అని ఎవరైనా భగవాన్‌తో అంటే వద్దని ఆయన చెప్పలేదు. ఆపూజించేవాడు ఎవరో తెలుసుకోమని చెప్పేవారు భగవాన్. దేవుని పూజించవద్దు అని ఆయన చెప్పలేదు. పూజించటానికి మీలో ఒకడు ఉండాలి వాడిని తెలుసుకోమని చెప్పారు. పూజ, జపం ఇవి అన్నీకూడా మనలోని జీవలక్షణాలను పోగొట్టటానికే.

ఎంత పూజచేసినా ఎంత జపం చేసినా మాకు స్థిరత్వం రావటంలేదు అని కొంతమంది చెపుతూ

ఉంటారు. మీరు ఎన్ని పూజలు చేసినా, జపం చేసినా మన హృదయంలో ఉన్న తత్వం మనకు అనుభవంలోనికి వచ్చేవరకూ ఏ మానవుడికి స్థిరత్వంరాదు. మనకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు తాత్కాలికంగా మనస్సు కుదురుగా ఉన్నట్లు అనిపించవచ్చు, ఆ కుదురు చెదిరిపోవటానికి ఎంతోకాలము పట్టదు. ఏదైతే శాశ్వతంగా ఉందో ఆ వస్తువు నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడే నీ శాంతి స్థిరపడుతుంది.

ఆత్మలోసుఖం ఉంది, శాంతి ఉంది, ఆనందము ఉంది. ఆత్మయొక్క స్వరూపమే సుఖము. పంచదారకు తీపి ఏవిధంగా అయితే గుణంగా ఉందోఅలాగే ప్రాపంచిక పదార్థములలో ఏదో ఒకదానికి సుఖము, శాంతి గుణముగా ఉంటే ఆ పదార్థమును మనం సంపాదించుకుంటే మనం అందరము సుఖంగా ఉంటాము. కాని ప్రపంచములో ఏ పదార్థమునకు సుఖంగాని, శాంతిగాని గుణంగా లేవు. ఒక్క ఆత్మకు మాత్రమే సుఖము, శాంతి గుణంగా ఉన్నాయి.

(మనస్సు అంతర్ముఖమవుతూ ఉంటే అదే ఆత్మ అవుతుంది. అది బయటకు విజృంభిస్తూ ఉంటే అహంభావన అయిపోతుంది అన్నారు భగవాన్.) జీవుడి యొక్కమూలం హృదయంలోనే ఉంది. జీవుడు ఎప్పుడైతే అణిగిపోయాడో అప్పుడు నీవు పోతావు అని అనుకోవద్దు. నీవు ఎవడివో నీకు తెలుస్తుంది. జీవుడు ఎక్కడైతే అణిగిపోయాడో అక్కడ ఒక మహాచైతన్యం తనలో కలుపుకోవటానికి నీకోసం ఎదురుచూస్తోంది. నీలో జీవలక్షణాలు ఎప్పుడైతే నశించాయో అప్పుడు ఆమహాచైతన్యం నిన్ను తనలో ఇముడ్చుకుంటుంది.

కొంతమందికి భక్తి ఉంటుంది. అది యాంత్రికంగా ఉంటుంది గాని అక్కడ ప్రేమ ఉండదు. పూజచేస్తారు, జపం చేస్తారు రోజూ అన్నం తిన్నట్లు స్నానం చేసినట్లుగా అవికూడా చేస్తారు గాని అక్కడ ఫీలింగ్ ఏమీ ఉండదు. మనం చేసే పని ఎరుకతో చేయాలి. పరాకుగా ఉండకూడదు. మనం ఎరుకతో చేస్తే ఏకాగ్రత పెరుగుతుంది, పవిత్రత పెరుగుతుంది, ప్రవీణత పెరుగుతుంది. నీ శరీరం ఎక్కడ ఉందో నీ మనస్సుకూడా అక్కడే ఉండాలి.

రమణమహర్షిగారు అరుణాచలం వచ్చినపుడు అరుణాచలేశ్వరుడిని ఏమీ అడుగలేదు ఎందుచేతనంటే దేవుని సంకల్పమే ఆయన సంకల్పము. నిజమైన శరణాగతి పొందినవాడు దేవుని ఏమీ అడగడు. దేవుని సంకల్పమే వాడి సంకల్పము కాబట్టి అడగవలసిన పని వాడికి లేదు. వేరు అయినపుడు దేవుని ప్రార్థించాలి, అడగాలి గాని దేవుని సంకల్పమే నా సంకల్పము అనుకొన్నవాడికి కోరికతో పనిలేదు, ప్రార్థనతో పనిలేదు.

సాధారణంగా మనకు ఏదైనా మంచి జరిగినపుడు అది దేవుని అనుగ్రహం అని అనుకొంటాము. చెడు జరిగినపుడు అది దేవుని అనుగ్రహం అని అనుకోము. కాని చెడులోకూడా దేవుని అనుగ్రహం ఉంది. మంచి జరిగినపుడు అది దేవుని అనుగ్రహం అని ఎలా అనుకొంటున్నావో అలాగే చెడు జరిగినపుడు కూడా అది దేవుని అనుగ్రహం అని అనుకో అప్పుడు నీవు ఉద్రేకానికి గురి అవ్వవు.

ఏదోరోజున మన శరీరము మరణిస్తుంది. అందులో ఎవరూ సందేహపడనవసరము లేదు. దేహం మరణించేలోపు మనకాలమును జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవాలి. అనవసరమైన విషయాలలోనికి, అనవసరమైన మాటలలోనికి వెళ్ళవద్దు. కాలమును పాడుచేసుకోవద్దు. మీ ఇంటి దగ్గర పనులు శ్రద్ధగా చేసుకోండి. ఇతరుల గొడవలలోనికి ఎక్కువ చొరబడకండి. దాని వలన అహంభావన పెరుగుతుంది. మీపనిని మీరు జాగ్రత్తగా చేసుకొంటూ, మీ దేహపోషణకు ఇతరులమీద ఆధారపడకుండామిగిలిన కాలములో మీస్వరూపమును తెలుసుకోవటానికి ప్రయత్నించండి. అలా ప్రయత్నం చేయకపోతే సోమరితనానికి అలవాటు పడతారు. సోమరితనానికి అలవాటుపడ్డ మనిషికి ఈ లోకమూ లేదు, పరలోకమూ లేదు. మనం పని చెయ్యాలి. ఆసక్తి పెట్టుకోకూడదు. పని సక్రమంగా చేయటంవలన దుఃఖమురాదు. ఆసక్తి పెట్టుకోవటంవలన దుఃఖము వస్తుంది. నీలోపల అహంభావన ఉంటే ఆసక్తి ఉంటుంది. అహంభావన ఉన్నంతకాలము ఆసక్తి ఉంటుంది. అహంభావన నశిస్తే ఆసక్తి కూడా నశిస్తుంది. అహంభావన లేకుండా ఏదైనా మంచి పని చేస్తే పుణ్యం

వస్తుంది, జ్ఞానం వస్తుంది. కాని అహంభావనతో మంచిపని చేస్తే పుణ్యం వస్తుంది గాని జ్ఞానం రాదు. అహంభావన లేకుండా పని చేస్తూ ఉంటే చిత్తశుద్ధి కలుగుతుంది. మీరు ఏ మార్గమును అవలంభించినప్పటికీ చిత్తశుద్ధి అనే గేటుద్వారానే హృదయం అనే ఆలయంలోనికి ప్రవేశించాలి.

జ్ఞానమార్గములో సాధన అంటే ఏమిటి అని భగవాన్‌ను అడిగితే అహంభావనయొక్క పుట్టు స్థానమును తెలుసుకోవటమే జ్ఞానమార్గములో సాధన అని చెప్పారు. నేను అనే తలంపు నీకు ఉంది. అది మొదటి తలంపు. దానికి ఇతరతలంపులు వస్తాయి. కోపము, రాగము, ద్వేషము ఇవి అన్నీ తలంపులే ఒకరిమీద ఇష్టం, ఒకరిమీద అయిష్టం ఇవికూడా తలంపులే. ఈ ఇష్టాలు, అయిష్టాలు తగ్గించుకొంటేగాని మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణంచేయదు.

చనిపోయిన తరువాత స్వర్గానికి, నరకానికి వెళతారని చెపుతారు. స్వర్గము, నరకము ఉన్నాయా లేక ఇవి భ్రాంతియేనా అని భగవాన్‌ను అడిగారు. నిజంగా అవి ఉంటే అక్కడకు వెళ్ళేవాడు ఒకడు ఉండాలి. అవి యదార్థం కాదు. అవి వ్యవహారిక సత్యములు. పారమార్థిక సత్యములు కావు. ఒక్క చైతన్యము మాత్రమే పారమార్థిక సత్యము. ప్రశ్నించేవాడిని కలనిజమా? మెలకువ నిజమా? అని భగవాన్ అడిగారు. కల నిజం కాదు, మెలకువ నిజం. స్వర్గనరకములు ఉన్నా అవి కలలువంటివి. మెలకువ నిజం అంటే ఏది మెలకువ? నీ హృదయంలో ఉన్న సద్వస్తువు నీకు అనుభవంలోనికి వచ్చినపుడు అదే నిజమైన మెలకువ. మీ హృదయంలో మేల్కొవటానికే మీరు వచ్చారు.

పక్షికి రెండు జన్మలు ఉంటాయి. ముందు గుడ్డుగా ఉంటుంది. తరువాత పిల్ల అవుతుంది. అదే విధంగా మనకు కూడా రెండు జన్మలు ఉన్నాయి. తల్లి కడుపులోనుండి బయటకు రావటం ఒక జన్మ. తల్లి కడుపులోనుండి నీ శరీరము బయటకు వచ్చినతరువాత నీ శరీరములో ఉన్నవాడు ఎవడో తెలుసుకొంటే అది మరోజన్మ. అంటే మనిషికి రెండు జన్మలు ఉన్నాయి. తల్లికడుపులోనుండి నీ శరీరము బయటకు వచ్చింది అంటే ఒక జన్మ అయిపోయింది. నీ హృదయంలో ఏమి ఉందో నీవు తెలుసుకొంటే అది రెండో జన్మ. అప్పుడు నీకు జ్ఞానం కలుగుతుంది, మెలకువ కలుగుతుంది.

ప్రపంచము ఒక స్వప్నము. స్వప్నమును స్వప్నములాగే చూడండి. మీపని పూర్తిచేసుకోండి అని భగవాన్ తరచుగా చెప్పేవారు. ప్రపంచము నిజం అని అనుకోవద్దు. ప్రపంచము ఉంది అని మనం చెపుతున్నాముగాని నేను ఉన్నాను అని ప్రపంచము చెప్పటంలేదు. ఇది కేవలము కల వంటిదే. అందువలన ప్రపంచమును కలలాగే చూడండి.

రమణమహర్షి శరీరముతో ఉండగా ఒక జ్ఞానిని అడిగారు మీరు ఎందుకు వెళ్ళి రమణమహర్షిని చూడటంలేదు అని. చూడవచ్చు, చూడకపోవచ్చు. జ్ఞానం అనేది ఒకటిగా ఉంటుందా, రెండుగా ఉంటుందా అని ఆయన అడిగారు. ఒకటిగానే ఉంటుంది అని చెప్పారు. అయితే ఇంక చూసేది ఏది? చూడబడేది ఏది? అన్నారు ఆయన. దేహప్రారబ్ధంలో ఉంటే చూడవచ్చు లేకపోతే చూడకపోవచ్చు. సత్యవస్తువు నీ హృదయంలోనే ఉంది. నీ హృదయంలో ఉన్నదే అంతటా వ్యాపించి ఉంది. దానికి పరిమితులు లేవు, బంధాలు లేవు, కాని మనం పరిమితులమై ఉన్నాము. మనం దేహమునకో, ఇంద్రియాలకో పరిమితమై ఉన్నాము అన్న సంగతి మనకు తెలుస్తోంది. లోపల ఉన్న సద్వస్తువును తెలుసుకొనేవరకూ పరిమితులనుండి మనం విడుదలపొందలేము. మానవుడు పరిమితులకు లోబడి ఉన్నంతకాలము దుఃఖమువాడిని విడిచిపెట్టదు.

కామక్రోధములు నాకు ఉన్నాయి. వాటివలన చెడ్డ వస్తోంది అన్న సంగతి నాకు తెలుస్తోంది. చేయగలిగిన సాధన చేస్తున్నాను. వాటిని వదిలించుకోలేకపోతున్నాను అని ఒకరు భగవాన్‌ను అడిగారు. కామము, క్రోధము ఇవి అన్నీ తలంపులే. జ్ఞానమార్గములో సాధన ఏమిటి అంటే మనకు ఏదైనా ఒక తలంపు వచ్చినపుడు ఈ తలంపు ఎవరికి వస్తోంది అని ప్రశ్నించుకోమన్నారు రమణాచార్యులు. ఎవరికి వస్తోంది

అంటే నేనుకు వస్తోంది. ఈ నేను అనేది కూడా ఒక తలంపే. ఇది కూడా ఒక తలంపే కాబట్టి గాఢనిద్రలో ఇది కూడా అణిగిపోతోంది. ఏనేనుకు ఈ తలంపు వస్తోంది. సత్యమైన నేనుకు వస్తోందా? అసత్యమైన నేనుకు వస్తోందా? అసత్యమైన నేనుకు వస్తోంది. ఎందుచేతనంటే ఈ తలంపులు వచ్చేనేను గాఢనిద్రలో అణిగిపోతోంది. అది కూడా అసత్యము కాబట్టి అణిగిపోతుంది. అదే సత్యము అయితే గాఢనిద్రలో అణగదు. దేహము నేను అని ఎవరి దేహము చెప్పటంలేదు. నిజమైన నేనుకూడా నేను అని చెప్పదు. బుద్ధిమంతుడు ఏదైనా మంచిపని చేస్తే నేను చేసాను అని చెప్పడు. అహంకారము అయితే నేను చేసాను అని చెపుతుంది. బుద్ధిమంతుడు నేను చేసాను అని చెప్పడు. ఏదో భగవంతుడు చేయించుకొన్నాడు. భగవంతుడే చేసాడు అంటాడు. తనమీద ఏమీ పెట్టుకోడు. భగవంతుని సంకల్పము లేకుండా ఏమి జరుగుతుంది. భగవంతుడే చేసాడు అంటాడు. నటనకోసం చెప్పటంకాదు అతని మనస్సులోకూడా ఆ తలంపు ఉండదు. పెన్నుపట్టుకొని పుస్తకంమీద ఏదైనా వ్రాస్తున్నాను అనుకోండి. పెన్ను అనుకోదు నేను వ్రాస్తున్నాను అని. అలాగే బ్రహ్మానుభవం పొందినవాడు ఏది చేసినా నేను చేస్తున్నాను అని అనుకోడు. ఎందుచేతనంటే నాచేతిలో పెన్ను ఎలా ఉందో అలాగే బ్రహ్మానుభవం పొందినవాడు భగవంతుని చేతిలో పనిముట్టులాగ ఉంటాడు. జ్ఞాని అంటే భగవంతునిలో ఐక్యం అయినవాడు. భగవంతునిలో ఐక్యం అయినవాడు భగవంతునికి పనిముట్టులాగ ఉంటాడుగాని భగవంతునికి వేరుగా ఉండడు. వేరుభావన ఉండదు. కొంతమందికి వేరుభావన అంటే ఇష్టం. దేవుడు వేరుగా ఉన్నాడు, నేను వేరుగా ఉన్నాను అనుకొంటూ ఉంటాడు. సాధన దశలో అది ఒక ప్రాథమిక స్థితి. అద్వైతానుభవం కలగటానికి ద్వైతం కొంతవరకూ సహకారం చేస్తుంది.

బ్రహ్మానుభవం పొందటానికి నీకు ఉన్నఅలవాట్లు, నీ మనస్సుకున్న చాపల్యము అడ్డు వస్తోంది. ఎవరో ఇతరులు అడ్డురావటం లేదు. బ్రహ్మం నీ హృదయంలో ప్రకాశిస్తోంది. దానిని నీవు సంపాదించనక్కరలేదు. అది నీవై ఉన్నావు. అది నీకు అనుభవంలో లేకపోయినా అది నీవై ఉన్నావు. తెలుసుకొంటే సుఖపడతావు. తెలియకపోతే జననమరణ ప్రవాహములో కొట్టుకొనిపోతావు. జననమరణప్రవాహమే సంసారము. శరీరములు మారినపుడు కుటుంబాలు మారతాయి, పరిసరాలు మారతాయి, పరిస్థితులు మారతాయి కాని నీ అహంభావన మాత్రము అలాగే ఉంటుంది. ఇప్పుడే ఈ శరీరము భూమిమీద తిరుగాడుతున్నప్పుడే అహంభావనయొక్క మూలమును తెలుసుకోవటానికి ప్రయత్నంచేయటమే జ్ఞానమార్గములో సాధన.

మనస్సుయొక్క ఊహకు అందనటువంటి శక్తి మన హృదయంలో ఉంది. నీ మనస్సు ఎప్పుడైతే హృదయంలో కరిగిపోయిందో ఆ మహాశక్తిలో ఐక్యమయిపోతుంది. ఇప్పుడు మనం కటికచీకటిలో ఉన్నాము చీకటిలోనుండి వెలుగులోనికి రావటానికి సాధనచేస్తున్నాము. సాధన చేసేటప్పుడు తాత్కాలికంగా కొంత కష్టం అనిపించవచ్చు. ఆ కష్టము అనుభవిస్తే భవిష్యత్‌లో అనంతమైన సుఖమును అనుభవిస్తావు. ఈకష్టము ఎప్పుడూ ఉండదు. సాధనచేసేటప్పుడు ప్రయత్నంచేసేటప్పుడు కొంత బాధ అనిపిస్తుంది. ప్రయత్నంచేయగా చేయగా ప్రయత్నంలేని స్థితికి ఎదిగివెళ్లిపోతావు. అప్పుడు నీకు బాధ తెలియదు. ఎంత అమావాస్యచీకటి అయినప్పటికీ కొంతటైము ఓపికపడితే వెలుతురు వచ్చేస్తుంది. అలాగే సాధన టైములో కొంత ఇబ్బంది కలిగినప్పటికీ ఆసాధనే, మిమ్మలను సిద్ధింప చేస్తుంది. మీరు చేసినది మీకే ఇచ్చేస్తాను అని భగవంతుడు చెప్పాడు. మీరు చేసిన కృషి నాకు ఏమీ అక్కరలేదు, మీకే ఇచ్చేస్తాను అని చెప్పాడు.

ఇప్పుడు మనం సహజస్థితిలో లేము. సహజస్థితిలో లేము కాబట్టే అసహజమైన గుణాలు, అసహజమైన ప్రకోపాలు, అసహజమైన మాటలు మనలోనుండి ఉబికి పైకి వస్తున్నాయి. దేహానికి పరిమితమై ఉండటమే సహజస్థితి అని అనుకొంటున్నాము. దేహానికి పరిమితమై ఉండటం సహజస్థితి కాదు. నీవు దేహానివి అయితే దేహానికి పరిమితమై ఉండటం సహజస్థితి అవుతుంది. కాని నీవు దేహానివి కాదు. నీవు ఎవరిగా ఉన్నావో వారు అయి ఉండటం సహజస్థితి. అప్పుడు ఉద్రేకాలు రావు. నీ ద్వారా పనిజరుగుతుంది. నేను చేస్తున్నాను,

నేను చేస్తున్నాను అని నీవు అనుకోవు. నీకు ఎప్పుడైతే బ్రహ్మానుభవం కలిగిందో నీ దేహమును ఈశ్వరుడు స్వాధీనం చేసుకొంటాడు. నీ దేహముద్వారా ఆయనపనిచేసుకొంటాడు. నీ దేహము దేవాలయం అవుతుంది.

కృత్రిమ గౌరవాలు కూడా తిరగనక్కరలేదు. గౌరవంకోసం ప్రయత్నం చేసేవాడికి ఎవరికీ గౌరవం రాదు. గౌరవంవస్తే రావచ్చును. గౌరవమును మనం కోరుకోకూడదు. ఎందుచేతనంటే అదికూడా నిన్ను బంధిస్తుంది. కోరికలేకుండా వచ్చినది బంధించదు. మనకోరికతో వచ్చినది తప్పనిసరిగా మనలను బంధిస్తుంది.

మీ మనస్సులో ఏమి జరుగుతోందో చూసుకొంటూ ఉండాలి. మీ మనస్సులో ఏమి ఉందో నాకు తెలియకపోయినా మీకు తెలుస్తూ ఉంటుంది. అంటే మనస్సుయొక్క వృత్తి ఎలా ఉందో మీరు చూసుకోవాలి. మానవుడు పొట్టకోసం ఏ వృత్తిలో ఉన్నాగాని అహంవృత్తిలో మాత్రం ఉండకూడదు అని భగవాన్ చెపుతూ ఉండేవారు. అహంవృత్తిని నశింపజేయాలి అంటే మీమనోవృత్తిని నిరంతరము చూసుకొంటూ ఉండాలి. మీ మనోవృత్తిని నిరంతరము వాచ్ చేసుకోవటంవలన మనస్సు తనమూలంలోనికి వెళుతుంది. మనస్సు తన మూలంలోనికి వెళ్ళినపుడు దానివృత్తి నశిస్తుంది. ఎంత చక్కటి మాటలో చూడండి.

దేవాలయములకు వెళ్ళటం, తీర్థయాత్రలు చేయటం మంచిదేనా అని భగవాన్‌ను అడిగితే మంచిదే అని చెప్పారు. కాని రమణమహర్షిగారిలో ఒక గుణం ఉంది. ప్రత్యక్షమార్గము ఉండగా ఇలా అక్కరలేని గొడవలలోనికి ఎందుకు అని చెప్పేవారు. మనగమ్యం చేరటానికి సిమ్మెంటు రోడ్డు ఉండగా సందులలోనికి, గొందులలోనికి తిరగటం దేనికి అంటున్నారు. Direct Method ఉండగా indirect method ఎందుకు. భగవాన్ ఎవరినీ బలవంతము చేయరు. విషయం చెపుతారు. సింపుల్‌గా చెపుతారు. సూటిగా చెపుతారు. మీకు నచ్చితే స్వీకరించవచ్చు.

నీవు వెదికే సద్వస్తువు నీ హృదయంలో ఉంది. నీలోపలే ఉంది. అంటే అంతటా లేదు అని కాదు. దేహమే నేను అనుకొంటున్నావు కాబట్టి నీకు ఒక కేంద్రం చూపించటంకోసం నీలోపలే ఉంది అని చెపుతున్నాడు. దేహమునకు పరిమితమైనవాడు జీవుడు. జీవుడు హృదయంలో కరిగిపోతే ఇక్కడ ఉన్నదే అంతటా ఉంది, అంతటా ఉన్నదే ఇక్కడ ఉంది అని అనుభవంలోనికి వస్తుంది. నీకు వ్యక్తిగతమైన భావన ఉంది కాబట్టి నిర్దేశించి అలా స్థానం చెప్పారు. నీకు వ్యక్తిగతమైన భావనలేకపోతే , నీ బుద్ధి దేహమునకు పరిమితమై లేకపోతే ప్రత్యేకమైన స్థానమును భగవంతుడు చెప్పనక్కరలేదు.

దేహమునుండి విడిపోవటానికి ఎవడూ సాధనచేయనక్కరలేదు. ప్రారబ్ధం అయిపోయినవెంటనే తన అంత తానుగా దేహము మరణిస్తుంది. మన కంట్రోలర్ మనహృదయంలోనే ఉన్నాడు. ప్రారబ్ధం అయిపోయినవెంటనే ఆ మరుక్షణంలో దేహమును, జీవుడిని వేరు చేసేస్తాడు. నీవు కానిదానిని నీవు అనుకొంటున్నావు. దేహము నేను అని నీలో ఒకడు చెపుతున్నాడు. వాడిలోనుండి విడుదలపొందటమే మోక్షము. దేహబుద్ధి నశించటానికి స్వామి శివానంద ఒక మాట చెప్పారు. Be good, Do good, See good అని చెప్పేవారు. మంచిగా ఉండు, మంచి చెయ్యి, మంచినే చూడు అని తరచుగా చెపుతూ ఉండేవారు. ప్రపంచములో మంచీ ఉంటుంది, చెడ్డా ఉంటుంది. నీవు మాత్రం మంచినే చూడటం నేర్చుకో. మంచిగా ఉండటానికి ప్రయత్నం చెయ్యి. మంచిని చూడగా చూడగా అది నీకు అనుభవంలోనికి వస్తుంది. మంచితనం సత్యంకాకపోయినా సత్యమును తెలుసుకోవటానికి మంచితనం సహాయం చేస్తుంది.

గురువును హృదయపూర్వకంగా ప్రేమిస్తూ ఉంటే గురువు మనహృదయంలోనే ఉన్నాడుకాబట్టి ఆయన మనకు ఎరుకపడతాడు. దీనికి పాండిత్యము ప్రధానము కాదు. పాండిత్యము, అధికారము, డబ్బు ఇవి అన్నీ ప్రకృతిశక్తులు. మనం వస్తువులను మెడలో ఎలా అలంకరించుకొంటున్నామో. అలాగే పాండిత్యముతోటి, డబ్బుతోటి, అధికారంతోటి ఈ శవాలను అలంకరించుకోవచ్చు. అవి నిన్ను హృదయంలోనికి తీసుకొనివెళ్ళలేవు. గురువుపట్ల నీకు ఉన్న ప్రేమ నిన్ను హృదయంలోనికి తీసుకొనివెళుతుంది. అందువలన నీవు ప్రేమను

విడిచిపెట్టవద్దు. ప్రేమవలన మాత్రమే నీవు భగవంతునిలో ఐక్యం అవ్వగలవు.

గురువు అన్నా, ఈశ్వరుడు అన్నా, ఆత్మ అన్నా ఒక్కటే. గురువు అంటే మనక్షేమమును కోరేవాడు, మన అభివృద్ధిని కాంక్షించేవాడు. జ్ఞానశిఖరాలకు మనలను తీసుకొనిపోవటానికి చూసేవాడే గురువు. గురువు అంటే మనకు ఆప్తుడు. నిజమైన బంధువు ఎవరు అంటే గురువే. మనక్షేమమును మనకంటే ఎక్కువగా గురువు కోరతాడు. గురువు అంటే ఎవడో అని అనుకోవద్దు. మన ఆప్తుడు. జననమరణప్రవాహంలో కొట్టుకొనిపోతున్న మనలను బయటకు తీసేవాడే గురువు. గురువును ప్రేమించటంలో మనకు హెచ్చుతగ్గులు వస్తూ ఉంటాయి. అయినా గురువు మనలను సమానంగా చూస్తాడు. మన హెచ్చుతగ్గులతో నిమిత్తం లేకుండా ఆయన ప్రేమను, శాంతిని వర్షింపజేస్తాడు ఆయన గురువు. గురువు ప్రేమ స్వరూపుడు, శాంతి స్వరూపుడు. మనలను ద్వేషించాలన్నా ఆయనదగ్గర ద్వేషం లేదు. అక్కడ ఉన్నది ప్రేమ, శాంతి కాబట్టి అవి తప్పించి ఇంకొకటి ఆయన ఇవ్వలేడు. నిరంతరము మనక్షేమమును కోరేవాడే గురువు. ఇలా పోల్చటంకూడా సరిపోదు. ఏదో ఒక పద్ధతిలో ఇలా చెపుతున్నాను అంతే.

బాహ్యంగా మీరు ఏదైనా ఒకరంగములో అభివృద్ధిలోనికి వస్తున్నారు అనుకోండి. మీ బంధువులలోనే అసూయ రావచ్చును. వారు అసూయ పడుతున్నారు అని మీరు గమనించినప్పటికీ వారిలోకూడా ఆత్మనే చూడటం నేర్చుకోవాలి. సాధకుడియొక్క దృష్టి అలా ఉండాలి. వారు అసూయపడుతున్నారు అని మీకు తెలుస్తున్నప్పటికీ అది గమనించటం మానివేసి మీరుమటుకు వారిని ఆత్మదృష్టితోనే చూడాలి.

నీవు ప్రపంచమును చూద్దువుగాని కంగారు లేదు. ముందు నిన్ను నీవు చూసుకొని ప్రపంచాన్ని చూడు అని భగవాన్ అంటూ ఉండేవారు. నిన్ను నీవు చూసుకొని ప్రపంచాన్ని చూస్తే ప్రపంచము నిన్ను మోహపెట్టదు ఎందుచేతనంటే బేధబుద్ధి నశిస్తుంది. ఎక్కడైతే బేధ బుద్ధి ఉందో అక్కడ మోహం వస్తుంది. బేధబుద్ధి లేనిచోట మోహం కలుగదు. కామం కూడా ఉదయించదు. బేధబుద్ధి ఉన్నచోట భయం వస్తుంది, క్రోధం వస్తుంది, అన్ని కోరికలు వస్తాయి. అన్ని అనర్ధాలకు ఇదే కారణము. ఈ బేధబుద్ధి నశించిన వెంటనేనీకు ఆత్మబుద్ధి కలుగుతుంది.

ఆత్మలేని క్షణం అంటూ లేదు. అది కొత్తగా సంపాదించేది కాదు. మనకు ఉన్న డబ్బు, పదవులు, పాండిత్యం నిజంకాదు. ఇవి ఎంతకాలం ఉంటాయి. కాల ప్రవాహములో అన్నీ కొట్టుకొనిపోతాయి. మహాసామ్రాజ్యములే అంతరించిపోయాయి. కాలప్రవాహం అన్నింటిని గెంటుకొనిపోతుంది. కాలమునకు అతీతముగా ఉన్నది బ్రహ్మము ఒక్కటే. కాని మానవుడు ఏదైనా వస్తే అది స్థిరంగా ఉంటుంది అనుకొంటాడు. వచ్చినది ప్రతీదీ పోతుంది: ఉన్నది మాత్రమే ఎప్పుడూ ఉంటుంది. ఇది జ్ఞాపకం ఉంచుకోండి.

గౌరవించవలసిన మనుషులను గౌరవించాలి. గౌరవించవలసిన మనుషులను గౌరవించకపోతే పొరపాటు. గౌరవించటానికి అర్హతలేని మనుషులను గౌరవిస్తే వారు గౌరవిస్తున్నారు అనే సద్భావన ఉండదు సరికదా మనకు కొన్ని చిక్కులు తెచ్చిపెడతారు.

ఎన్నో జన్మలనుండి గురువు వేరు, నేను వేరు అనుకొన్నాను. గురువు అంటే ఎక్కడో ఉన్నాడు అనుకొన్నాను. కాని ఈనాటికి తెలిసింది. మీరు బయట లేరు నా హృదయంలోనే ఉన్నారు అని తెలిసింది. ఈ అనుభవమును మీరే కలుగచేసారు. మీ ఋణం తీర్చుకోవటానికి నన్ను ఏమి చేయమంటారు అని ఒక శిష్యుడు గురువుగారిని అడిగాడు. నువ్వు ఏ అనుభవమును అయితో పొందావో, ఏ స్థితిని అయితే పొందావో అలాగే ఉండిపో. అలాగే ఉండటమే నాఋణం తీర్చుకోవటం అన్నారు ఆయన. వాడు గురువు అంటే. గురువు నీ హృదయంలోనే ఉన్నాడు అనే అనుభవం నీకు కలిగింది. ఆ అనుభవంనుండి జారకుండా అది స్థిరం అయ్యేలాచూసుకో, ఆస్థితిలో ఉండిపో. అలా ఉంటే నా ఋణం తీర్చుకొన్నట్లే అన్నారు. ఎంత చక్కగా ఉందో చూడండి.

మీకు ఇష్టమైన గురువుమీద, దేవునిమీద మనస్సును నిలబెట్టి ఉంచితే అది ధ్యానం అవుతుంది. ఇదికూడా ఒక తలంపే. ఈ తలంపు బలపడటంవలన ఇతర తలంపులు ఆగిపోతాయి. దేవుని భావన మీలో బలపడుతుంది. మీ మనస్సుబలపడుతుంది. ధ్యానంవలన మీ మనస్సుకు శక్తి కలుగుతుంది. ధ్యానం చేయగా చేయగా మీ మనస్సు బలపడి బ్రహ్మానుభవం కలగటానికి అడ్డువచ్చేవాటిని ఎదుర్కొని వాటిని నశింపజేస్తుంది. అది ధ్యానంయొక్క ఫలం.

ఏదైతే సత్యమో అదే నిత్యముగా ఉంటుంది. సత్యము కానిది నిత్యముగా ఉండదు. నీ దేహము సత్యము కాదు అందువలన అది నిత్యముగా ఉండదు. మనస్సు ఏరోజుకారోజు మారిపోతూ ఉంటుంది. నిలకడగా ఉండదు. ఎందుచేతనంటే అది కూడా సత్యంకాదు. మన మనస్సు నిలకడగా ఉంటే, కుదురుగా ఉంటే పరిపాలించటానికి పాలకులు, ప్రభుత్వము అక్కరలేదు.

గాఢనిద్రలో నీకు దేహభావనగాని, దేహమునకు సంబందించిన స్మృతిగాని లేదు. గాఢనిద్రలో దేహభావన లేనప్పుడుకూడా నీవు ఉన్నావు. అదే నీ సహజస్థితి. కాని దేహభావన ఉన్నప్పుడే నీవు సహజస్థితిలో ఉన్నాను అని అనుకొంటున్నావు. దేహభావన లేనప్పుడు ఉన్నస్థితే సహజస్థితి. దేహమునకు పరిమితమైన బుద్ధి అంటే ఈ దేహభావన నశించినప్పుడే నీకు సహజ స్థితి తెలుస్తుంది. అప్పుడు శాంతి ప్రవాహము వచ్చి నీ సహస్రారమును ముంచుతుంది.

భగవంతుడిని ఏమీ అడగనక్కరలేదు. నీకు ఎప్పుడు ఏది అవసరమో అది ఇస్తూ ఉంటాడు. అడగటంవలన శక్తి వృధా అవుతుంది. భగవాన్ అరుణాచలేశ్వరుడితో ఇలా అన్నారు. అడగకుండానే ఇచ్చే అలవాటు నీకు ఉంది అని లోకం అంతా చెప్పుకొంటున్నారు. నేను అడగకుండానే నీవు నాకు ఏదైనా ఇవ్వాలి. నా చేత అడిగించుకొని ఇచ్చావు అనుకో నాకు ఏమీ నష్టం లేదు. నీ ప్రతిష్ఠకు అప్రతిష్ఠ అన్నారు భగవాన్. ఎంత అందముగా చెప్పారో చూడండి.

నీ సంకల్పమే నా సంకల్పము, నీ భావనే నా భావన అని భగవంతునితో అంటూ ఉంటే మీకు శరణాగతి అలవాటు అవుతుంది. మీకు శరణాగతి అలవాటైనప్పుడు భగవంతుని అది అడగాలి; ఇది అడగాలి అనే అహంభావన పోతుంది. శరణాగతి అలవాటు అయితే నేను ఎవడను అనే విచారణకూడా అక్కరలేదు. మీరు ఎలా పోగొట్టుకొన్నా దేహమునకు పరిమితమైన నేనును పోగొట్టుకోవాలి. మీకు నచ్చిన మార్గము, మీ ప్రవృత్తికి అనుకూలంగా ఉన్న మార్గములో ప్రయాణం చేయవచ్చు. అన్ని మార్గములు కూడా మోక్షమును పొందింపచేస్తాయి.

నిన్ను ఎవరైతే హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నారో వారిని చంపకుండా చంపుతావు. అది నీ గుణం అని అక్షరమణమాలలో అరుణాచలేశ్వరుడితో భగవాన్ అన్నారు. మీరు బాగుపడటానికి ఈ ఒక్కవాక్యం చాలు. అరుణాచలేశ్వరుడిని ఎవరైతే హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నారో వారిని చంపకుండా చంపుతాడు అని భగవాన్ అన్నారు. అంటే వారి దేహమును చంపడు. దేహం ఉండగానే దేహమునకు పరిమితమైన బుద్ధిని చంపుతాడు.

నిరంతరము భగవంతుని తలపెట్టుకొంటూ ఉంటే అదే నిజమైన భక్తి. మనప్రయత్నం లేకుండా సహజముగా కూర్చున్నప్పుడు కూడా భగవంతుడు మన తలంపులోనికి వస్తూ ఉంటే వాడే నిజమైన భక్తుడు. స్మరించటం అంటే చిన్న మాట అనుకొంటున్నారేమో అదే నిజమైన భక్తి.

నేను ఉన్నాను అనుకో, నేను అది, నేను ఇది అని అలా అనుకోవద్దు. నీకు డబ్బు ఉన్నా, గౌరవం ఉన్నా ఉంటే ఉండనియ్యి. వాటితో తాదాప్యం పొందవద్దు. తాదాప్యం పొందకుండా ఉంటే దుఃఖము నశిస్తుంది. తత్వం తెలియనపుడు పూర్వజన్మలు, రాబోయే జన్మలు, పుణ్యపాపములు, హెచ్చు తగ్గులు అన్నీ ఉన్నాయి. తత్వం తెలిసినవాడికి ఇవి అన్నీ ఎక్కడ ఉన్నాయి అంటున్నారు భగవాన్. తత్వం

తెలిసిన తరువాత ఇవి అన్నీ లేవు అన్న సంగతి నీకు తెలుస్తుంది అంటున్నారు.

మురుగునార్ రమణభక్తుడు. మురుగునార్‌కు రమణమహర్షి అంటే ఎంత ప్రేమఅంటే మీకు రమణమహర్షి గొడవ తప్పించి, ఆయన నామము, రూపము, ఆయన సాహిత్యము తప్పించి ఇంక ఏ గొడవ ఉండదు ఏమిటి అని ఒకరు మురుగునార్‌ను అడిగితే జ్ఞానసూర్యుడిని చూసిన నేత్రాలతో ఇంకదేనిని చూస్తాము అన్నారట మురుగనార్. చూడకూడదు అని కాదు, చూడవలసిన పనిలేదు.

(B) (ఇంత అద్వైతము గురించి చెపుతున్నారు. వ్యక్తిగతమైన దేవుడు ఉన్నాడా అని భగవాన్‌ని అడిగారు. వ్యక్తిగతమైన దేవుడు ఉన్నాడు అని చెప్పారు. అయితే నువ్వు ఎంతనిజమో వాడుకూడా అంతేనిజం అని భగవాన్ చెప్పారు.) మనం బలహీనమైన మనస్సుతో ఉన్నాము కాబట్టి బాహ్యంగా గురువును ఎన్నుకోవాలి గాని మీకు నిజంగా స్వరూపం తెలిసినపుడు, మీరు ఎవరో మీకు తెలిసినపుడు ఇంక గురువుతోగూడ పనిలేదు. మనస్సు ధృఢం అవ్వాలి. మనస్సు బలహీనంగా ఉండకూడదు. లౌకికజ్ఞానము నిజమైన జ్ఞానము కాదు. లౌకికజ్ఞానము మనిషిని, అసత్యమునుండి సత్యములోనికి తీసుకొనివెళ్ళలేదు. లౌకికజ్ఞానముఆత్మానుభవమును కలుగచేయలేదు. ఒక్క ఆత్మజ్ఞానము మాత్రమే ఆత్మానుభవమును కలుగజేస్తుంది. మన మనస్సు బలహీనంగా ఉంది అనుకోండి. మన మనస్సుకంటే లౌకికంగా ఉన్న వారి మనస్సు బలంగా ఉంటే వారితో కలసి ఉన్నప్పుడు మీకు కూడా లౌకిక తత్త్వము వచ్చేస్తుంది. ఇక్కడ మనం బహుజాగ్రత్తగా ఉండాలి. మీకు భక్తి ఉంది అనుకోండి. అది బలంగాలేకపోతే లౌకికులప్రభావం మీమీద పనిచేస్తుంది. అందువలన లౌకికులకు సాధ్యమైనంత దూరంగా ఉండడం మంచిది.

ఆత్మ అంటే ఎవరో అనుకోవద్దు. మీ స్వరూపమే ఆత్మ. ఆత్మ విద్యవలన ఆత్మ తెలియబడుతుంది. ఆత్మ ఎప్పుడైతే తెలియబడిందో మీ ద్వారా సమాజమునకు సహాయం అందుతుంది. మొదట ఆత్మానుభవం సంపాదించటానికి ప్రయత్నం చెయ్యండి. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండండి. స్నేహాల విషయంలో జాగ్రత్తగా ఉండండి; మాటల విషయంలో జాగ్రత్తగా ఉండండి. మనస్సును జయించాలంటే మొదట నాలుకను జయించాలి. నాలుకను స్వాధీనం చేసుకొంటే మాట క్రమంగా ఉంటుంది, నిదానంగా ఉంటుంది. ఇతరులకు శాంతి కలిగే మాటలు ఆ నాలుక పలుకుతుంది.

నీ హృదయంలో సత్యవస్తువు ఉంది. దానితో సహవాసం చేయటం నేర్చుకో. అది సత్సంగము. అది చేయలేకపోతే బయట ఉన్న సత్పురుషులతో సహవాసం చెయ్యి. సత్పురుషులు; సద్గ్రంథాలు మనం బాగు పడటానికి దారి చూపిస్తాయి. జ్ఞానులసమక్షంలో ఉంటే ప్రగాఢమైన శాంతి, మీ మాటలకు అందని శాంతి, మీ ఊహలకు అందని శాంతి ప్రవాహములాగ వచ్చి మిమ్మలను ముంచుతుంది. బాహ్యంగా మీకు ఉన్న పరిస్థితులతో సంబంధము లేకుండా జ్ఞాని హృదయంనుండి వచ్చే కాంతి తరంగాలు, శాంతి తరంగాలు మిమ్మలను శాంతిలో ముంచుతాయి.

మీరు సోమరితనంగా ఉండవద్దు. జరిగిపోయిన విషయములుగురించి బెంగపెట్టుకోవద్దు. జరిగిపోయిన విషయములగురించి ఎంత ఆలోచించినా అవి తిరిగిరావు. వర్తమానకాలమును సద్వినియోగం చేసుకోండి. వర్తమానకాలము మీచేతులలో ఉంది. దానిని ఉపయోగించుకోండి.

మీరు తొందరపడవద్దు. పరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నా, వ్యతిరేఖంగా ఉన్నా ప్రశాంతముగా ఉండండి, నిదానంగా ఉండండి. అన్ని దానములలోకి నిదానం గొప్పది అని చెప్పారు. శాంత చిత్తమును విడిచిపెట్టద్దు, శాంతచిత్తమే నిజమైన ధనం. శాంతి లేకపోతే సుఖం లేదు అని త్యాగరాజు చెప్పారు. మీకు ఎన్ని ఉన్నా శాంతి లేకపోతే జీవితం సున్నా.

పూజగదిలో పూజకు సంబంధించిన సామానులు ఎలా బద్రపరచుకొంటారో అలాగే మనస్సులో మంచి గుణాలను పెట్టుకోండి. మనస్సు గుణమందిరం అవ్వాలి. అంటే మీ మనస్సు మంచి గుణములతో నిండి ఉండాలి.

✪ ✪ ✪